సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 15 । జూన్ । 2024



అరుణాచలానికి బస్సు

అరుణాచలం గిరి ప్రదక్షిణ, కంచిలోని ఆలయాల సందర్శనకు తణుకు డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేశారు. IIలో ▸



విత్తన శుద్ధి కీలకం

సార్వా పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. విత్తన ఎంపిక, శుద్ధి, సస్యరక్షణపై రైతులు దృష్టి పెట్టాలని అధికారులు సూచిస్తున్నారు. IIలో ▸



కాన్పు కోసం వెళ్తే మృతి

నూజివీడు పట్టణంలోని ఒక నర్సింగ్ హోం లో కాన్పు కోసం వచ్చిన గర్భిణి ఆపరేషన్ థియేటర్‌లో ప్రాణాలు కోల్పోయింది. IIలో ▸

ధాన్యం సొమ్ముల కోసం నిరీక్షణ

- 'పశ్చిమ'లో పూర్తయిన రబీ ధాన్యం కొనుగోళ్లు
- ఆర్‌బీకేల ద్వారా 6.40 లక్షల టన్నుల ధాన్యం సేకరణ
- రైతులకు చెల్లించాల్సిన మొత్తం రూ.1,399 కోట్లు
- ఇంతవరకు చెల్లించింది రూ.461 కోట్లు
- నిర్ణీత గడువు 21 రోజులు
- బకాయిలు రూ.938 కోట్ల సొమ్ముల కోసం రైతుల ఎదురుచూపులు



ధాన్యాన్ని సంచుల్లోకి ఎక్కిస్తున్న రైతులు (ఫైల్)

సాక్షి, భీమవరం: 2023 సీజన్‌కు గాను పశ్చిమగోదావరి జిల్లాలో రబీ ధాన్యం సేకరణ పూర్తయ్యింది. ధర బాగుండటంతో అధిక శాతం మంది రైతులు తమ ధాన్యాన్ని మార్కెట్‌లో విక్రయించుకునేందుకే మొగ్గుచూపారు. రూ.1,399 కోట్ల విలువైన 6.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా.. ఇంత వరకు రైతుల ఖాతాలకు రూ.461 కోట్లు జమ య్యాయి. మిగిలిన సొమ్ముల కోసం ఎదురు చూపులు చూస్తున్నారు.

2.10 లక్షల ఎకరాల్లో..

జిల్లాలోని 2.10 లక్షల ఎకరాల్లో రబీ సాగు చేశారు. అధిక శాతం విస్తీర్ణంలో 1121 రకం వెరైటీ సాగు చేశారు. ఖరీఫ్ చివరిలో మిచాంగ్ తుపాను ప్రభావంతో రబీ ఆలస్యమైనా ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేసి సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. తెగుళ్ల బెడద తక్కువగా ఉండటంతో రైతుల పంట పండి ఎకరాకు 50 నుంచి 55 బస్తాల వరకు దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి.

6.4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

జిల్లా వ్యాప్తంగా 9.25 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా కాగా స్థానిక అవసరాలు పోను 7.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు జిల్లా ప్రొక్యూర్‌మెంట్ కమిటీ నిర్ణయించింది. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో తలమునకలై ఉన్నప్పటికీ రైతులకు ఇబ్బంది కలుగకుండా కలెక్టర్ సుమిత్‌కుమార్ పర్యవేక్షణలో జేసీ ప్రవీణ్ ఆదిత్య ధాన్యం సేకరణకు చర్యలు తీసుకున్నారు. ఎక్కడా లోపాలు తలెత్తకుండా కొనుగోళ్లను పర్యవేక్షించేందుకు మొబైల్ టీంలు ఏర్పాటు చేయడంతో పాటు 211 పెద్ద, చిన్న రైసు మిల్లులను గుర్తించి, వాటికి కస్టోడియన్ అధికారుల నియామకం చేశారు. 1.8 కోట్ల గోనె సంచులు అందుబాటులో ఉంచారు. ఈ–క్రాప్‌లో నమోదైన వివరాల మేరకు ఆర్‌బీకే సిబ్బంది నేరుగా పొలాల్లో రైతుల వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలు చేశారు. మద్దతుకు మించి ధర రావడంతో బయట మార్కెట్‌లో ధాన్యం విక్రయాలకు రైతులు మొగ్గుచూపారు. ఈ క్రమంలో జిల్లాలోని 324 ఆర్‌బీకేల ద్వారా 71,735 మంది రైతుల నుంచి రూ.1,399 కోట్ల విలువైన 6.4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు.

ఎదురుచూపులు : ఖరీఫ్ మొదలైన నేపథ్యంలో సాగు పెట్టుబడుల నిమిత్తం ధాన్యం సొమ్ముల కోసం రైతులు ఎదురుచూపులు చూస్తున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో బకాయిల విడుదలకు పాలకులు, అధికార యంత్రాంగం చొరవ చూపాలని కోరుతున్నారు. ధాన్యం బకాయిలపై ఉన్నతాధికారులకు నివేదించామని, త్వరలోనే నిధులు విడుదలవుతాయని సివిల్ సప్లయిస్ అధికారులు అంటున్నారు.

దళారులు, కమిషన్ వ్యాపారుల దోపిడీకి ఎక్కడ ఆస్కారం లేకుండా రైతులకు అండగా గత ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు చేస్తూ వచ్చింది. ధాన్యం విక్రయించిన 21 రోజుల లోపే వారి ఖాతాలకు సొమ్ములు జమచేయాలి. ఆన్‌లైన్ చేయడంలో జాప్యం, సాంకేతిక అవరోధాలతో సొమ్ముల చెల్లింపుల్లో జాప్యంతో ఇబ్బంది పడాల్సి వచ్చేది. ఈ క్రాప్ డేటా ఆధారంగా

చెల్లింపుల్లో జాప్యం

ఆధార్ ఎనేబిల్డ్ పేమెంట్ సిస్టమ్‌ను తీసుకువచ్చి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. ఫలితంగా నిర్ణీత గడువుకన్నా ముందే గత ఖరీఫ్‌లో ధాన్యం విక్రయించిన రెండు మూడు రోజుల్లోనే చెల్లింపులు జరిగాయి. రబీలోను సత్వర చెల్లింపులు చేస్తూ వచ్చారు. ముందుగా ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలోనే వారి ఖాతాలకు సొమ్ములు జమయ్యాయి. ఇంతవరకు రూ.461 కోట్ల మేర చెల్లింపులు జరిగాయి. ఎన్నికలు రావడంతో కొద్దిరోజులుగా ధాన్యం సొమ్ములు జమచేయడం నెమ్మదించింది. ఇంకా రూ.938 కోట్లు రైతులకు అందాలి. సొమ్ములు రావాల్సిన వారిలో అధికశాతం మూడు వారాల గడువు ముగిసిన వారే ఉన్నట్టు రైతులు అంటున్నారు.

న్యూస్‌రీల్

గోవధ నేరం



గోవధ నిషేధంపై అవగాహన ర్యాలీ

భీమవరం: గోవు పవిత్రమైందని, గోవు వధ చట్టరీత్యా నేరమని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కె.మురళీకృష్ణ అన్నారు. భీమవరంలో శుక్రవారం జిల్లా జంతు సంరక్షణ సంఘం, పశుసంవర్ధక శాఖ, రవాణా, విద్యాశాఖ, దిశ పోలీస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో గోహత్య చట్టరీత్యా నేరం, గోహత్యను మానండి అంటూ చేపట్టిన అవగాహన ర్యాలీని ప్రారంభించారు. బక్రీద్ సందర్భంగా జంతు బలులు నిషేధిస్తున్నట్లు ప్రభుత్వ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జాఫర్ హుస్సేన్, జిల్లా జంతు సంక్షేమ సంఘం నోడల్ ఆఫీసర్ డాక్టర్ సత్యనారాయణ జంతు బలుల నిషేధం , నిబంధనలు అతిక్రమించినవారిపై శిక్షలను వివరించారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ వి.మురళీకృష్ణ, మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవికుమార్, చెరుకువాడ రంగసాయి, సుంకర దాసు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్నులు చెల్లించకపోతే కుళాయి కట్

నరసాపురం: పెద్ద మొత్తంలో ఏళ్ల తరబడి ఆస్తి పన్నులు, కుళాయి పన్నులు చెల్లించకపోతే సదరు ఇళ్లకు మంచినీటి కుళాయి కనెక్షన్లు కట్ చేస్తామని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మొండి బకాయిలు రాబట్టడానికి చర్యలు చేపట్టామని చెప్పారు. వార్డు సచివాలయాల కార్యదర్శులకు ఈ మేరకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. భారీ మొత్తంలో ఆస్తి పన్ను బకాయిలున్నవారికి రెడ్ నోటీసులు జారీ చేయాలని మున్సిపల్ రెవిన్యూ అధికారులను ఆదేశించామని చెప్పారు.

ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



డీఈవో నాగమణికి వినితిపత్రం అందజేస్తున్న ఏఐఎస్‌యూ నాయకులు

పాలకొల్లు అర్బన్: జిల్లాలో గుర్తింపు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకుని వాటి గుర్తింపు రద్దు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి నాగమణికి వినతిపత్రం అందజేసినట్లు ఏఐఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కె.సాయిమనోజ్ శుక్రవారం తెలిపారు. జిల్లాలో గుర్తింపులేని విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయన్నారు. అక్రమ అడ్మిషన్లు తీసుకుంటున్న విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు సరైన వసతులు కల్పించకుండా వేలాది రూపాయలు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. పాలకొల్లు కార్యదర్శి ఎస్.అవినాష్, బి.లోకేష్, భీమవరం కార్యదర్శి కె.భాను తేజ, సిద్ధు, నాని తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



భీమవరంలో విలేకర్లతో మాట్లాడుతున్న నర్సింహమూర్తి

భీమవరం: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నర్సింహమూర్తి కోరారు. గీతకార్మికుల సమస్యలపై ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వం గీత కార్మికుల సమస్యలు పట్టించుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులెదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన ప్రభుత్వం రాష్ట్రంలో ఎక్సైజ్ శాఖను తక్షణం ప్రక్షాళన చేయాలని, కల్లు గీత కార్మిక సొసైటీలకు 40 శాతం బ్రాందీ షాపులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆదరణ పథకం, గీత కార్పొరేషన్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఏటా బడ్జెట్లో గీత కార్మికుల సంక్షేమానికి రూ.5 వేల కోట్లు కేటాయించాలని, ప్రమాదంలో చనిపోయిన గీత కార్మిక కుటుంబాలకు తక్షణం రూ.10 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి నేనూ బడికి పోతా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈ నెల 15 నుంచి ఏలూరు జిల్లాలో నేనూ బడికి పోతా ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ బీ సోమశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. బడి బయట ఉన్న పిల్లలు, బడిలో నమోదు కాని 6 నుంచి 14 సంవత్సరాల లోపు బాలబాలికలను గుర్తించి వారిని బడిలో చేర్పేలా ప్రత్యేక నమోదు కార్యక్రమం ఈ నెల 21వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యపై అవగాహన కల్పించి పాఠశాలల్లో చేర్పించడానికి జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో సీఆర్‌పీలు, ఐఈఆర్‌పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కేజీబీవీ సీఆర్‌టీ ఉపాధ్యాయులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, పార్ట్‌టైమ్ ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలన్నారు. సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులందరూ ఆయా మండలాల్లో పర్యవేక్షిస్తూ బడి బయట ఉన్న, బడిలో నమోదుకాని పిల్లలందరినీ బడిలో చేర్పాలన్నారు. కార్యక్రమంలో భాగంగా శనివారం బడి ఉత్సవం – బాలికా ఉత్సవం పేరిట మండల కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించాలని, 18న ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి భవిత కేంద్రాల్లో చేర్పాలని, 19వ తేదీన విద్యా సదస్సు నిర్వహించాలని ఆదేశించారు. ఈ నెల 20న సమాజంతో ఒక రోజు కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు.

వృద్ధులపై వేధింపులు అరికట్టాలి



ఏలూరు కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేస్తున్న సీనియర్ సిటిజన్స్ యూనియన్ నాయకులు

ఏలూరు (టూటౌన్): వృద్ధులపై వేధింపుల నివారణ దినోత్సవం సందర్భంగా.. వృద్ధుల సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా, నగర సీనియర్ సిటిజన్స్ యూనియన్ నాయకులు శుక్రవారం ఏలూరు కలెక్టరేట్‌లోని జేసీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్రాపు శివరామ కృష్ణారావు మాట్లాడుతూ.. జూన్ 15న ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవంగా ఐరాస ప్రకటించిందని గుర్తు చేశారు. వృద్ధుల పోషణ, ఆస్తి, ప్రాణ రక్షణకు కేంద్ర ప్రభుత్వం 2007లో సంరక్షణ చట్టం చేసిందన్నారు. 2011లో రాష్ట్ర ప్రభుత్వం ఆ చట్టానికి నిబంధనలు తయారు చేసి రాష్ట్రంలో అమలు చేయాలని ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. చట్టం అమలులోకి వచ్చి 13 సంవత్సరాలు పూర్తయినా నేటికీ పటిష్టంగా అమలు కావడంలేదన్నారు. సీనియర్ సిటిజన్స్ జిల్లా కమిటీ సమావేశాలు ప్రతి మూడు నెలలకు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ట్రిబ్యునల్ తీర్పులు పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేకంగా ఒక హెడ్ కానిస్టేబుల్‌ను నియమించి వృద్ధుల సమస్యలపై స్పందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ఏలూరు జిల్లా కోశాధికారి నారాయణరావు, కౌన్సిల్ సభ్యులు నారాయణ, సుబ్రహ్మణ్యం, ఏలూరు యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్ తదితరులున్నారు.

శిలాఫలకం ధ్వంసం



గొల్లపల్లిలో ధ్వంసం చేసిన శిలాఫలకం

నూజివీడు: మండలంలోని గొల్లపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని వ్యక్తులు గ్రామంలోని శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. జెండా చెట్టు సెంటర్ వద్ద సిమెంట్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో శిలాఫలకాన్ని ఏర్పాటు చేయగా, దానిని అప్పటి ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు ఆవిష్కరించారు. అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాలు ధ్వంసం చేయడం అనాగరిక చర్యని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు.

రక్తదానంతో ముగ్గురికి ప్రాణదానం



ప్రపంచ రక్తదాత దినోత్సవంలో మాట్లాడుతున్న జాయింటు కలెక్టరు సి.వి.ప్రవీణ్ ఆదిత్య

భీమవరం (ప్రకాశంచౌక్): ఒకరి రక్తదానంతో మరో ముగ్గురికి ప్రాణదానం చేయవచ్చని, రక్తదానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జాయింటు కలెక్టరు ప్రవీణ్ ఆదిత్య అన్నారు. శుక్రవారం స్పందన సమావేశ మందిరంలో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ పశ్చిమ గోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాత దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో సేవా భావం ఉండాలన్నారు. సేకరించిన రక్తం ద్వారా ప్లాస్మా, ప్లేట్‌లెట్స్, రక్తంగా విభజించి మరో ముగ్గురి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. జిల్లాలో సుమారుగా 20 లక్షల జనాభా ఉన్నారని, వారికి 24 వేల యూనిట్లు రక్తం అవసరమని, అందుకు అనుగుణంగా రక్త సేకరణ జరగాలన్నారు. సంవత్సరానికి మూడు నుంచి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించినప్పుడే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. సమావేశానికి హాజరైన వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టరు కానాల సంగీత్ మాధుర్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డా.ఎం.ఎస్.వి.శివరామ భద్రిరాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.బి.భాను నాయక్, కోశాధికారి కలిదిండి తిరుపతి రాజు, సీనియరు కో ఆర్డినేటరు ఎస్.మల్లేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో భారీ వర్షం



వర్షం కురుస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం పట్టణంలో శుక్రవారం రాత్రి 8 గంటల నుంచి భారీ ఈదురు గాలులు, ఉరుములు, పిడుగులతో భారీవర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో రోడ్లు నీటమునిగాయి. కుండపోత వర్షంతో జనజీవనం స్తంభించింది.

ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలపై సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని వరదముంపు ప్రాంతాలలో ముందస్తు చర్యలు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో సమావేశమై ముందస్తు ప్రణాళికలపై చర్చించారు. పెనుగొండ, మొగల్తూరు, ఆచంట, నరసాపురం, యలమంచిలి మండలాల్లోని కొన్ని గ్రామాలు వరద ముంపునకు గురవుతున్నాయని, ఈ వర్షాకాలం సీజన్‌లో ఎంత వర్షం కురవొచ్చు, ఎన్ని క్యూసెక్కుల నీరు చేరవచ్చనే సమాచారంపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. భద్రాచలం నుంచి విడుదలయ్యే నీటిని అంచనగా తీసుకుని ముందుగా ఏ మండలాల్లోని ఏయే గ్రామాలలో నీరు చేరవచ్చో ఆయా గ్రామాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. 15 లక్షల క్యూసెక్కుల నీరు వస్తే ఎన్ని గ్రామాలు ప్రభావితం అవుతాయి, 20 లక్షలు క్యూసెక్కులు నీరు వస్తే ఎన్ని గ్రామాలపై ప్రభావం ఉంటుందనే అంచనాకు రావాలన్నారు. చిన్నగొల్లపాలెం వద్ద పరిస్థితులు మెరుగుపరచాలన్నారు. గట్లు బలహీనంగా ఉన్న ప్రాంతాలను ముందస్తుగా గుర్తించి ఇసుక బస్తాలు సిద్ధంగా ఉంచాలన్నారు. ఏదైనా గ్రామంలో వరద నీరు చేరితే పునరావాస కేంద్రాల ఏర్పాటుకు ముందస్తుగా గుర్తించాలన్నారు. సమావేశంలో నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.అచ్యుత్ అంబరీష్, కెనాల్స్ ఈఈ ఎం .దక్షిణామూర్తి, డ్రైనేజీ ఈఈ ఎంవీవీ కిషోర్, నరసాపురం ఇరిగేషన్ ఏఈఈ మోహన్ కృష్ణ, కోఆర్డినేషన్ సూపరింటెండెంట్ చందన దుర్గాప్రసాద్, డిప్యూటీ తహసిల్దార్ కె.కల్యాణి పాల్గొన్నారు.

ఆణిముత్యాలు అమలయ్యేనా?

- గతేడాది పది టాపర్లకు రూ.లక్ష నగదు బహుమతి
- జిల్లా, నియోజకవర్గాల స్థాయి విజేతలకూ ప్రోత్సాహకాలు
- ఈ ఏడాది ఇంతవరకూ అందని మార్గదర్శకాలు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రభుత్వ విద్యారంగాన్ని అభివృద్ధి పథంలో నడపడానికి, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో ప్రతిభావంతులను ప్రోత్సహించడానికి ఉద్దేశించి గత ప్రభుత్వం పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ చూపిన వారికి ఆణిముత్యాల పేరిట నగదు ప్రోత్సాహకాలు అందించింది. ఈ పథకాన్ని ఏటా అమలు చేయనున్నట్లు గత ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో 2023 –24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించారు. ఈ ఏడాది కూడా నగదు ప్రోత్సాహకాలు అందుతాయని భావించారు. పదో తరగతి విద్యార్థులకు మాత్రమే కాకుండా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు సైతం ఈ ప్రోత్సాహకాలు అందించారు. ప్రతి గ్రూపులో టాపర్లను ఎంపిక చేసి వారికి ఈ ప్రోత్సాహకాలు అందించారు. ఆణిముత్యాలుగా ఎంపికైన విద్యార్థులు చదువుతున్న పాఠశాలల్లో ఉపాధ్యాయులను, నగదు పురస్కారం అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రులను కూడా ప్రభుత్వం ఘనంగా సత్కరించి గౌరవించింది.

గత ఏడాది టాపర్లకు రూ.లక్ష బహుమతి

ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ వివిధ గ్రూపులు చదివిన విద్యార్థుల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను ఎంపిక చేసి టాపర్లకు రూ. లక్ష నగదు ప్రోత్సాహకం అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్వయంగా అందచేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ. 75 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ. 50 వేలు అందచేశారు. ఇంటర్ విద్యార్థులకూ అమలు చేశారు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ/ఎంఈసీ వంటి ప్రతి గ్రూపులో టాపర్లకు నగదు బహుమతులు అందజేశారు. నగదు పురస్కారంతో పాటు సర్టిఫికెట్, మెడల్స్ కూడా ఇచ్చి విద్యార్థులను ప్రోత్సహించారు.

జిల్లా, నియోజకవర్గాల స్థాయిలో ప్రోత్సాహకాలు

విజేతలకు నగదు ప్రోత్సాహకాలు కేవలం రాష్ట్ర స్థాయికే పరిమితం చేయకుండా నియోజకవర్గ, జిల్లా స్థాయికి వర్తింపజేశారు. నియోజకవర్గ స్థాయి టాపర్లకు రూ.15 వేలు, ద్వితీయ స్థానంలో రూ.10 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.5 వేలు అందచేశారు. జిల్లా స్థాయిలో టాపర్లకు రూ. 50 వేలు, ద్వితీయ స్థానం రూ. 30 వేలు, తృతీయ స్థానం రూ. 15 వేలు అందించారు. ఈ రెండు స్థాయిల్లో కూడా ఇంటర్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించారు. జగనన్న స్ఫూర్తితో కొన్ని ప్రాంతాల్లో స్థానిక దాతల సహకారంతో పాఠశాల స్థాయిలో టాపర్లకు నగదు పురస్కారం అందచేశారు. పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానానికి రూ.3 వేలు, ద్వితీయ స్థానానికి రూ.2 వేలు, తృతీయ స్థానానికి రూ. వెయ్యి నగదు బహుమతులు అందచేశారు.

ఈ ఏడాది అందని మార్గదర్శకాలు

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచి వారి భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో అమలు చేసిన ఆ పథకానికి గత ఏడాది తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి గొప్ప స్పందన లభించింది. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదని, ఈ పథకాన్ని భవిష్యత్‌లో కూడా కొనసాగించాలని కోరారు. గత ఏడాది జూన్ 20 నాటికి అన్ని స్థాయిల్లో నగదు ప్రోత్సాహకాలు అందించే కార్యక్రమాలు పూర్తి చేశారు. ఈ ఏడాది విద్యార్థులకు ఇలాంటి నగదు పురస్కారం అందుతుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయంపై విద్యాశాఖ రాష్ట్ర కార్యాలయం నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. జిల్లా విద్యాశాఖాధికారులకు ఎటువంటి మార్గదర్శకాలూ అందకపోవడంతో ఈ ఏడాది నగదు ప్రోత్సాహకాలు ఇస్తారా? లేదా? అన్నది సందేహంగా కనిపిస్తోంది.

శాంతి థాంలో వాసవీ హోమం



పెనుగొండ శాంతిథాంలో వాసవీ హోమం

పెనుగొండ: అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాంలో తెలంగాణకు చెందిన ఆర్యవైశ్య భక్తులు శుక్రవారం వాసవీ హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుడు శిష్టా మణికంఠ ఆధ్వర్యంలో ఉదయం నుంచి పంచలోహ వాసవీ మాత విగ్రహానికి పూజలు, మరకత శిల వాసవీ మాతకు అభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు. వాసవీ హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు.

మంత్రి నిమ్మలకు అభినందనలు

ఏలూరు(మెట్రో): రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడికి జిల్లా ఎన్జీవో అసోసియేషన్, జలవనరుల శాఖ తరఫున అభినందనలు తెలుపుతున్నామని జిల్లా ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాకు నీటిపారుదల శాఖ మంత్రి రావడం హర్షణీయమన్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని ఆయన కోరారు. జలవనరుల శాఖలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ ఉద్యోగులు, ఇంజినీర్లు, లస్కర్ల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పెదతాడేపల్లిలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి విక్టర్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెద తాడేపల్లి గ్రామ పంచాయతీలో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య పనులు నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ ఎం.వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు టి.రవిచంద్ర, కే.వేణు అరవింద్, జె.దివ్య, జూనియర్ అసిస్టెంట్ రఘునాథరాజు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడిగా సుబ్బయ్య



భీమవరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడిగా గరికిముక్కు సుబ్బయ్య నియమితులయ్యారు. ఈ మేరకు సామాజిక సమరసత వేదిక అఖిల భారత కన్వీనర్ శ్యాంప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సుబ్బయ్య విలేకర్లతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలోని అన్ని ఉప కులాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సంక్షేమ, అభివృద్ధి ఫలాలు సమానంగా అందేందుకు కృషి చేస్తానన్నారు. ఎస్సీ, ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు అర్హులైన వారికే అందే విధంగా చూస్తానని తప్పుడు మార్గంలో కుల ధ్రువీకరణ పత్రాలు పొందే వారిపై చట్టరీత్యా చర్యలు చేపట్టే విధంగా చూస్తానని సుబ్బయ్య చెప్పారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గొటుకుల జాషువాను నియమించారని ఇద్దరితో కలిసి సమన్వయంతో పనిచేసి ఎస్సీ, ఎస్టీలకు సేవలందిస్తామన్నారు.

నేటి నుంచి రైతు కూలీ సంఘం మహాసభలు



ఏలూరు ఆర్ఆర్పేట ప్రధాన రహదారిలో కళా ప్రదర్శన నిర్వహిస్తున్న డప్పు కళాకారులు

ఏలూరు (టూటౌన్): ఏలూరులో శనివారం నుంచి మూడు రోజుల పాటు రైతు కూలీ సంఘం(ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం డప్పు కళాకారులు నృత్యాలతో ప్రదర్శన నిర్వహించారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ స్థానిక పవరుపేట రైల్వే స్టేషన్ వద్ద నుండి ప్రచార జాత కళాకారులు డప్పుల నృత్యాలతో త్రినాథ్ ప్యాషన్స్ మీదుగా ఆర్ఆర్పేట పార్కు,జీవీ మాల్ మీదుగా ప్రభుత్వ ఆస్పత్రి వరకూ ఈ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి షేక్ బాషా మాట్లాడుతూ నేడు రైతాంగం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని పరిష్కరించాలని ఈ మహాసభల్లో చర్చిస్తారన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం(ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.వర్మ, కోశాధికారి ఎస్ లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి కీలకం

- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 5.40 లక్షల ఎకరాల్లో వరిసాగు
- విత్తనాల సేకరణ, విత్తన శుద్ధిపై రైతులకు అప్రమత్తత అవసరం



తాడేపల్లిగూడెం ప్రాంతంలో సార్వా వరి నారుమడి

భీమవరం: సార్వా వరి నారుమడి పనుల్లో రైతులు నిమగ్నయ్యారు. గత రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వెన్ను దన్నుగా నిలబడి అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడంతో రైతులు ఉత్సాహంగా వరి సాగుపట్ల ఆసక్తి చూపించారు. రైతులకు వరికోత యంత్రాలు, ట్రాక్టర్లకు పెద్ద మొత్తంలో సబ్సిడీ ఇవ్వడమేగాక పంట బీమా పథకం, ఇన్‌పుట్ సబ్సిడీ కోట్లాది రూపాయలు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేయడంతో గత ఐదేళ్లుగా రైతులు పెద్దగా ప్రైవేటు వ్యక్తుల వద్ద వడ్డీలకు సొమ్ములు తెచ్చుకోనవసరం లేకుండానే వరిసాగు చేశారు. ప్రస్తుతం సార్వాసాగుకు సిద్ధమవుతున్న రైతులు నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం రైతులకు ఏ మేరకు అండగా ఉంటుందోననే సంశయంతో ఉన్నారు. ప్రభుత్వ పథకాల మాటేలాఉన్నా వరిసాగులో విత్తన ఎంపిక, విత్తనశుద్ధి, సస్యరక్షణ వంటివాటిపై రైతులు దృష్టి పెట్టాలని వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో సుమారు సుమారు 5.40 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు చేయనున్నారు. దీనిలో పశ్చిమగోదావరి జిల్లాలో 2.40 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో సుమారు 3 లక్షల ఎకరాలు ఉన్నాయి. వరి నారుమళ్లు వేయడానికి ఎకరాకు 30 కిలోల వరకు విత్తనాలు అవసరమవుతాయి.

విత్తనాల సేకరణ ఇలా..

పురుగులు, తెగుళ్లు ఆశించని పొలం నుంచి విత్తనాలను సేకరించుకోవాలి. రైతులు తమ సొంత విత్తనాన్నే వాడుకుంటుంటే పంట కోత కోసిన తరువాత విత్తనాలతో పాటు కలిసిపోయిన మట్టి శిలీంద్ర బీజాలు, పురుగు తుట్టెలను తీసివేసి శుభ్రం చేసి నిలువ చేసుకోవాలి. బయట విత్తనాన్ని కొనుగోలు చేసే సమయంలో విత్తన శుద్ధి చేశారో లేదో నిర్ధారించుకోవాలి. కొనుగోలు చేసిన విత్తనానికి సంబంధించిన బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలి. కొనుగోలు చేసిన విత్తనాల మొలక శాతం తప్పనిసరిగా పరీక్షించుకోవాలి.

నాణ్యమైన విత్తనం అయినా..

ఎక్కువ మంది రైతులు సొంతంగా విత్తనాలను పండించుకోవడం లేదా తోటి రైతుల నుంచి విత్తనాలను కొనుగోలు చేస్తుంటారు. విత్తనాలతో పాటు కొన్ని తెగుళ్లను కలుగచేసే శిలీంద్రాలు, బాక్టీరియా, వైరస్ వంటివి పంటలను ఆశించి తీవ్రమైన నష్టాన్ని కలుగచేస్తుంటాయి. కొన్ని సందర్భాల్లో నాణ్యమైన విత్తనం అయినప్పటికీ భూమి నుంచి, వివిధ రకాల పురుగుల నుంచి తెగుళ్లు ఆశించి పంటను నష్టపరుస్తూ ఉంటాయి. అందువల్ల పంటను తొలిదశలోనే రక్షించుకోవడానికి సిఫారసు చేసిన శిలీంద్ర నాశినులతో గాని, పురుగు మందులు లేదా జీవ శిలీంద్రనాశినులతో తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలి. ఈ విత్తన శుద్ధి మందులు పొడి, ద్రవ రూపంలో, కాన్సన్‌ట్రేట్స్ రూపంలో మార్కెట్‌లో అందుబాటులో ఉంటాయి.

విత్తన శుద్ధికి ఇవే పద్ధతులు

పొడి విత్తన శుద్ధి : డ్రమ్ముల్లో మూడింట రెండొంతులు విత్తనం వేసి సిఫార్సు చేసిన మోతాదులో మందు వేసి బాగా తిప్పితే ఉత్తనానికి మందు పట్టుకుంటుంది. కొన్ని రకాల విత్తనాలకు జిగురు, బెల్లం ద్రావణం, చిక్కటి గంజి ద్రావణం వంటివి కలపడం వల్ల మందు బాగా పట్టుకుని విత్తన శుద్ధి మందు విత్తనానికి ఒక రక్షణ కవచంగా ఏర్పడి చీడ పీడల నివారణకు సాధ్యమవుతుంది.

తడి విత్తన శుద్ధి : ముఖ్యంగా వరి విత్తన శుద్ధికి తగినంత నీటిని తీసుకుని ఆ నీటిలో సిఫార్సు చేసిన మందులు కలుపుకొని నీటిలో విత్తనాలను నానబెట్టుకోవడం ద్వారా చీడ పీడల నుంచి పంటలను రక్షించుకోవచ్చు..

జీవ శిలీంద్ర నాశినులతో...

కొన్ని రకాల జీవ శిలీంద్ర నాశినులతో ముఖ్యంగా ట్రైకోడెర్మావిరిడి. ట్రైకోడెర్మా హార్జయానం, సూడోమోనాస్ వంటి వాటితో విత్తన శుద్ధి చేయడం వల్ల ఇవి తమ సంతతిని భూమిలోనే అభివృద్ధి చేసుకుని తెగుళ్లను కలుగచేసే శిలీంద్రాలను నాశనం చేయడమేగాక పంట చివరి వరకు కూడా రక్షణ కల్పిస్తాయి. ఈ మందులు భూమిలోనే అభివృద్ధి చెంది తరువాత వేసే పంటలకు కూడా ఉపయోగపడతాయి. వీటి మోతాదు కిలో విత్తనానికి 8 నుంచి 30 గ్రాముల వరకు వాడుకోవాలి. సిఫార్సు చేసిన మందులతో విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా తక్కువ ఖర్చుతో పంటలను చీడపీడల బారి నుంచి రక్షించుకోవచ్చును.

విత్తన శుద్ధిపై దృష్టి పెట్టాలి



వరిసాగులో విత్తన శుద్ధి ద్వారా పురుగుమందులు ఖర్చు తగ్గడమేగాక పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చు. సార్వా సాగుకు సిద్ధమవుతున్న రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధిపై దృష్టిపెట్టాలి. విత్తన శుద్ధికి అవసరమైన సమాచారం కోసం అందుబాటులో ఉన్న వ్యవసాయశాఖాధికారులను సంప్రదించాలి.

– డాక్టర్ ఎంవీ కృష్ణాజీ, వ్యవసాయపరిశోధనా స్థానం, ప్రధానశాస్త్రవేత్త, మార్టేరు

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీస్



తణుకులో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మేనేజర్ గిరిధర్‌కుమార్

తణుకు అర్బన్: అరుణాచలం గిరి ప్రదక్షిణ, కంచిలోని ఆలయాల సందర్శనకు తణుకు ఆర్టీసీ బస్సు డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ వీడియో కోచ్ బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ అన్నారు. తణుకు ఆర్టీసీ డిపోలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రత్యేక బస్సు ఈనెల 20న సాయంత్రం 5 గంటలకు బయలుదేరి 21న శ్రీకాళహస్తిలోని పంచభూతలింగమైన వాయులింగం, కాణిపాకం, విఘ్నేశ్వరస్వామి, శ్రీపురంలోని గోల్డెన్ టెంపుల్, మహాలక్ష్మి అమ్మవారి, పౌర్ణమి రోజు అరుణాచలం గిరి ప్రదక్షిణ, పంచభూత లింగమైన అగ్ని లింగ క్షేత్ర దర్శనాలతోపాటు తిరుగు ప్రయాణంలో కంచిలోని కామాక్షి అమ్మవారి, పంచభూత లింగక్షేత్రం, శివకంచి ఏకంబరేశ్వరస్వామి, విష్ణు కంచి, బంగారు బల్లి దర్శనాలతో ముగుస్తుందని చెప్పారు. 49892 సర్వీసు నంబరుతో ప్రయాణించే సూపర్‌లగ్జరీ, వీడియోకోచ్‌కు టికెట్ ధర రూ. 3 వేలు మాత్రమేనని, వివరాలకు 98482 84384, రిజర్వేషన్ కోసం 94404 19144 నంబర్లలో సంప్రదించాలని కోరారు. అలాగే ఆర్టీసీలో అతి తక్కువ ధరలతో కార్గో సేవలను విస్తరించినట్లు చెప్పారు. కార్గో కొరియర్‌కు సంబంధించి కనిష్ట రుసుము రూ. 50లు, డోర్ డెలివరీ రూ. 68లు, పార్సిల్స్‌కు సంబంధించి కనిష్టంగా రూ. 65లు, డోర్ డెలివరీ రూ. 95లుగా సేవలందిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్న వారికి కార్గో బుకింగ్ ఏజెన్సీ ఇస్తామని, డిపాజిట్ కేవలంరూ. 2వేలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. అనంతరం అరుణాచలం గిరిప్రదక్షిణ యాత్రకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు.

పశుసంవర్ధక శాఖ సమీక్షా సమావేశం



జంగారెడ్డిగూడెం ఎంపీడీవో కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం పశు సంవర్ధక శాఖ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏలూరు జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ నెహ్రూ బాబు, నూజివీడు డీడీ డాక్టర్ కె.చంద్రశేఖర్‌లు తదితరులు పాల్గొని వర్షాకాలంలో వచ్చే వ్యాధులకు చిన్న, పెద్ద పశువులకు అనగా సన్న జీవాలు అయిన గొర్రెలు మేకలు, ఆవులు, గేదెలకు టీకాలు, సాధారణ చికిత్స గురించి వివరించారు. జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాల పశు వైద్యం నిమిత్తం రెండు యానిమల్ లిఫ్టర్స్‌ను, జంగారెడ్డిగూడెం ప్రాంత వైద్యశాల చుట్టూ ఫెన్సింగ్‌ను జంగారెడ్డిగూడెం నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యం అందించడంతో కార్యక్రమంలో ఫ్యాక్టరీ పీఆర్ఓ రాఘవరావును సన్మానించి, మెమెంటోను అందించారు. ఏడీ డాక్టర్ పీఎస్వీ శేఖర్ దొర, డాక్టర్ మండవ భీమేశ్వరరావు, డాక్టర్ బి.ఆర్ శ్రీనివాసన్, డాక్టర్ పి.అపురూప, డాక్టర్ ఆదిత్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ థియేటర్‌లో గర్భిణి మృతి

పోలీసులను ఆశ్రయించిన భర్త



మృతిచెందిన ముప్పిడి వాసంతి

నూజివీడు : పట్టణంలోని బస్టాండు సమీపంలోని శైలజ నర్సింగ్‌హోంకు నిండు గర్భిణి కాన్పు నిమిత్తం రాగా ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లాక ఏమి జరిగిందో ఏమో బిడ్డతో బయటకు రావాల్సిన నిండు గర్భిణి ప్రాణాలే పోయాయి. దీనిపై మృతిరాలి భర్త ఫిర్యాదు మేరకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనికి సంబంధించి ఎస్సై డి.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం విజయవాడలోని అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన ముప్పిడి వాసంతి(30) పుట్టిల్లు ఆగిరిపల్లి. అయితే ఆమెను మూడో కాన్పు నిమిత్తం ఈనెల 12న రాత్రి 8 గంటల సమయంలో పట్టణంలోని శైలజ నర్సింగ్‌హోంకు కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు. ఆపరేషన్ చేయాల్సి ఉంది కాబట్టి 13వ తేదీ మధ్యాహ్నం 12గంటలకు ఆపరేషన్ చేస్తామని వైద్యురాలు వారికి తెలిపారు. దీనిలో భాగంగా 13న ఉదయం 11.45గంటలకు వాసంతిని ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారు. అయితే ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లాక ఏమైందో ఏమో మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో గర్భిణి చనిపోయినట్లు వైద్యురాలు కుటుంబ సభ్యులకు తెలిపారు. అయితే ఆ తరువాత వైద్యురాలితో చర్చలు జరిపిన తరువాత మృతదేహాన్ని అజిత్‌సింగ్‌నగర్‌లోని ఇంటికి తీసుకెళ్లారు. అయితే మత్తు అధిక డోసు ఇవ్వడం వల్లనే తన భార్య చనిపోయిందని శుక్రవారం ఉదయం ఆరు గంటలకు మృతిరాలి భర్త అయిన జయనాగప్రవీణ్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై డి.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. డిప్యూటీ తహసీల్దార్ నేతృత్వంలో శవపంచనామా నిర్వహించారు. వైద్యుల బృందం పోస్టుమార్టమ్ చేయాల్సి ఉండటంతో పోస్టుమార్టమ్‌ను శనివారం నిర్వహించనున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీస్ స్టేషన్ వద్ద దళిత సంఘాల ధర్నా



తణుకు పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళనకారులతో మాట్లాడుతున్న సీఐ నాగరాజు

తణుకు: దళిత యువకుడిపై దాడి చేసి గాయపరచిన నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తణుకు పోలీసు స్టేషన్ ఎదుట దళిత సంఘాలు ధర్నాకు దిగాయి. దాడి చేసిన నిందితులకు పోలీసులు వత్తాసు పలుకుతున్నారని పలువురు ఆరోపించారు. తణుకు పట్టణంలోని ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న మల్లిపూడి రాకేష్‌పై ఈనెల 2న స్థానిక టేకి వారి వీధిలో పినక సతీష్‌కుమార్, అడిద వెంకటేష్‌లు దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనలో గాయాలపాలైన రాకేష్ తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులపై అట్రాసిటీ కేసు నమోదు చేసినప్పటికీ నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని బాధిత బంధువులు ఆరోపిస్తున్నారు. మరోవైపు నిందితులకు పోలీసులు వత్తాసు పలుకుతూ తిరిగి బాధితుడిపై కేసు నమోదు చేశారన్నారు. ఈ క్రమంలో తణుకు పట్టణ పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న ఆందోళన కారులతో సీఐ నాగరాజు మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో సీఐ మాట్లాడుతూ ఇరువర్గాలు ఒకరిపై ఒకరు చేసుకున్న ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేశామన్నారు. అయితే ఈ ఘటనపై తాడేపల్లిగూడెం డీఎస్పీ మూర్తి విచారణ చేస్తున్నారని చెప్పారు. ఘటన జరిగిన రోజున సీసీ పుటేజీలో నమోదైన దృశ్యాలు ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2537]

Wanted

■ Reputed School in Bhimavaram need Qualified, Experience Teachers for High School & Primary School Salary:18000 to 25000 P.M., Cont:08816 223416, 95816 36687. [P-772876]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217 [M-1185215]

■ కష్టలెస్సీ కాదుVIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా,నర్సులు, వంటచేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ. 15000 - 40000, ఫ్రీ రూమ్+భోజనం. HYD.7995984445 [HA-228]

■ PRAVIDANCE ENGLISH MEDIUM School Eluru- Wants Trained Lady Graduate Teachers to Teach Telugu For Classes I - VII Cont: Immediately Ph. 94944 15165 [P-772827]

www.sakshi.com సాక్షి స్పోర్ట్స్

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సోమేశ్వరస్వామి సేవలో కేంద్ర సహాయ మంత్రి వర్మ



పంచారామ క్షేత్రంలో కేంద్ర మంత్రి వర్మ దంపతులు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం గునుపూడిలో ఉన్న పంచారామ క్షేత్రం శ్రీ సోమేశ్వర జనార్ధన స్వామి వార్ల దేవస్థానంలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాస వర్మ దంపతులకు స్వాగతం పలుకగా, దర్శనం అనంతరం వేద ఆశీర్వదం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖ అధికారి ఈవీ సుబ్బారావు, ఈఓ డి.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

20న ఐటీడీఏ పరిధిలో జాబ్ మేళా

ఏలూరు (టూటౌన్): ఐటీడీఏ కేఆర్‌పురం పరిధిలోని ఐదు మండలాల నిరుద్యోగ గిరిజన యువతకు తిరుపతిలోని శ్రీసిటీ మోండలైజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో టైర్స్‌లో ఉద్యోగాల కోసం ఈ నెల 20న ఐటీడీఏ కేఆర్ పురంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోండలైజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఉద్యోగాలకు ఇంటర్ మొదటి ప్రయత్నంలోనే 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని, 18 నుంచి 21 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలన్నారు. అపోలో టైర్స్‌లో ఉద్యోగాలకు డిగ్రీ/డిప్లమో/బీటెక్ చదివి 2020-2024 మధ్య కాలంలో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులుగా పేర్కొన్నారు. ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 20న ఉదయం 10 గంటల నుంచి ఐటీడీఏలో వైటీసీ మీటింగ్ హాల్‌లో హాజరుకావాలని తెలిపారు.

ట్రాక్టర్ సీజ్

జంగారెడ్డిగూడెం: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై జి.జ్యోతిబాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఇసుక అక్రమ రవాణాపై తమకు అందిన సమాచారం మేరకు మైసన్నగూడెం గ్రామ శివారు జల్లేరు వాగు సమీపంలో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా తగరం నాగరాజు ఇసుకను రవాణా చేస్తుండటంతో పట్టుకుని ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉద్యాన వర్సిటీకి ప్రాజెక్టు



సైంటిస్టుకు ప్రాజెక్టు పత్రాలు అందిస్తున్న ఉద్యానవర్సిటీ వీసీ టి.జానకీరామ్

తాడేపల్లిగూడెం: రాష్ట్ర ఉన్నత విద్యామండలి సహకారంతో గోదావరి క్లస్టర్ యూనివర్సిటీల ద్వారా వేస్ట్ టు వెల్త్ అనే అంశంపై ఉద్యానవర్సిటీకి ప్రాజెక్టు వచ్చింది. ఏపీ నిట్, నన్నయ్య యూనివర్సిటీ , కలిసి ఈ ప్రాజెక్టును చేయనున్నాయి. రెండు సంవత్సరాల వ్యవధిలో పది లక్షల రూపాయల వ్యయంతో నిర్వహించే ఈ ప్రాజెక్టు పత్రాలను శుక్రవారం ఇన్విస్టిగేటర్ ప్రొఫెసర్ డి.ఆర్.సలోమిసునీత కు అందచేశారు. ఈ ప్రాజెక్టు చాలా ప్రయోజనకరమని , బత్తాయి, నిమ్మ నారింజ జామ వంటి తొక్కలతో అధికంగా లభించే పెక్టిన్ అనే పదార్థాన్ని వేరు చేసి , విలువ జోడించడం ద్వారా న్యూట్రాస్యూటికల్‌గా మార్చడం, ఆహారం, ఫార్మాస్యూటికల్‌గా విభాగాలకు ప్రయోజనాలు ఈ ప్రాజెక్టు ద్వారా వస్తాయన్నారు. ఈ ప్రాజెక్టు ఫలితాలు సమాజానికి ఉపయోగపడతాయని వీసీ జానకీ రామ్ అన్నారు.

ప్రజల మద్దతు మనకే



కైకలూరులో కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు : నియోజకవర్గంలో ఎన్నడూ చూడని అభివృద్ధిని వైఎస్సార్ సీపీ పాలనలో చేసి చూపామని అందువల్ల ప్రజల మద్దతు మనకే ఉంటుందని మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. ఏలూరు రోడ్డులోని పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గ నాలుగు మండలాల నుంచి వచ్చిన కార్యకర్తలు, నాయకులతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి డీఎన్నార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామన్నారు. ఎవరూ అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు.

గోవులను, దూడలను వధించడం చట్ట విరుద్ధం

భీమవరం: బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో ఎవరైనా గోవులను, దూడలను అక్రమ రవాణా చేయటం గానీ, వాటిని వధించడం గానీ చేస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొనబడతాయని జిల్లా ఎస్పీ అజిత తెలిపారు. పోలీసు ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే గోవధ, జంతు సంరక్షణ చట్టం 1977, జంతు రవాణా నియమాలు, స్లాటర్ హౌస్ రూల్స్ ప్రకారం తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గోవధ నివారణకు జిల్లా ప్రత్యేక పర్యవేక్షకుడిగా భీమవరం దిశ డీఎస్పీ ఎస్.మురళి కృష్ణను నియమించామని తెలిపారు.

శరీర దానం చేసిన దంపతులు



శరీరదానానికి సంబంధించిన పత్రాలను వైద్యులకు అందజేస్తున్న కమ్యూనిస్టు దంపతులు

నూజివీడు: తాము మరణించిన తరువాత తమ భౌతికకాయాలను కమ్యూనిస్టు దంపతులు దానం చేశారు. మండలంలోని గొల్లపల్లికి చెందిన సీపీఎం నూజివీడు మండల కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, ఆయన సతీమణి శశికళ శుక్రవారం ఏలూరులోని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు వెళ్లి అందులోని అటానమీ విభాగానికి చెందిన వైద్యులు డాక్టర్ భరత్, డాక్టర్ చంద్రికలకు భౌతికదేహం దానం (శరీర దానం) చేస్తూ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు దంపతులిరువురిని అభినందించారు. అనంతరం నిమ్మగడ్డ నరసింహా మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు శరీర నిర్మాణ శాస్త్రాన్ని బోధించడానికి, వైద్య విద్యార్థుల పరిశోధనకు దోహదపడతాయనే ఉద్దేశంతోనే తామిద్దరం శరీరదానం చేసినట్లు వివరించారు.

76 మద్యం బాటిళ్ల స్వాధీనం

వీరవాసరం: వీరవాసరం మసీద్ సెంటర్లో మద్యం అక్రమంగా అమ్ముతున్న ప్రాంతంపై దాడి చేసి 76 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని భీమవరం రూరల్ సీఐ సత్య కిషోర్ శుక్రవారం తెలిపారు. వీరవాసరం మసీదు సెంటర్లో అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న సమాచారం మేరకు దాడి చేయగా గ్రామానికి చెందిన షేక్ మస్తాన్ బాష అక్రమ మద్యం అమ్ముతూ పట్టుబడ్డాడని పేర్కొన్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.11,400 విలువ చేసే 76 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో ఎస్సై పి.రమేష్ పాల్గొన్నారు.

పాల వ్యాన్ బోల్తా



దెందులూరు వద్ద బోల్తా పడిన పాల వ్యాన్

దెందులూరు: జాతీయ రహదారిపై దెందులూరు- కొవ్వలి బ్రిడ్జి వద్ద శుక్రవారం పాలవ్యాన్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వైజాగ్ నుంచి మధురై వెళ్తున్న పాల వ్యాన్ దెందులూరు- కొవ్వలి బ్రిడ్జి వద్ద బోల్తా పడింది. గాయాలు పాలైన డ్రైవర్‌ను వైద్య చికిత్స నిమిత్తం ఆశ్రం ఆసుపత్రికి 108 వాహనంలో తరలించామని దెందులూరు ఎస్సై కె.స్వామి తెలిపారు.

మోటార్‌సైకిల్ చోరీ

జంగారెడ్డిగూడెం : మోటార్‌సైకిల్ చోరీపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాస రెడ్డి తెలిపారు. టి.నరసాపురానికి చెందిన నార్లపాటి మోహన్ జంగారెడ్డిగూడెం పట్టణం శ్రీనివాసపురం రోడ్‌లోని టాటా కెస్టల్ కార్యాలయంలో తన మోటార్‌సైకిల్‌ను ఈనెల 29న పార్క్ చేశాడు. తిరిగి 30వ తేదీ ఉదయం వచ్చి చూసే సరికి మోటార్‌సైకిల్ కనపించకపోవడంతో చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం పోలీసులను ఆశ్రయించాడు.

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ



పెదతాడేపల్లి వద్ద డివైడర్‌ను ఢీకొన్న లారీ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెద తాడేపల్లి మేకల సంత సమీపంలో శుక్రవారం డివైడర్‌ను లారీ ఢీకొంది. తుని నుంచి మహారాష్ట్ర తమలపాకుల లోడుతో వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. అయితే, లారీలోని డ్రైవర్, క్లీనర్‌లకు ఎలాంటి ప్రాణాపాయం లేదు. ప్రమాదంలో లారీ దిగువ భాగం ధ్వంసమైంది.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



తాడేపల్లిగూడెం: పట్టణంలోని యాగర్లపల్లికి చెందిన గంటా సందీప్ (24)అనే యువకుడు విశాఖపట్నం వైపునకు వెళుతున్న రైలుకింద పడి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసై స్థిమితం లేకుండా సందీప్ శుక్రవారం రైలుకు ఎదురుగా నిలబడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై హరిబాబు కేసు నమోదు చేశారు. యువకుడి మృతదేహానికి స్థానిక ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

క్లుప్తంగా

కేంద్ర సహాయ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



కేంద్ర సహాయ మంత్రిని కలిసి అభినందనలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు: కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు సహాయ మంత్రిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మను శుక్రవారం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. భీమవరంలోని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే రాధాకృష్ణ పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ శుక్రవారం రక్తదానం చేశారు. స్థానిక బుద్దాల నర్సింహమూర్తి బ్లడ్ బ్యాంకులో స్వచ్ఛందంగా ఎమ్మెల్యే రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కలగర వెంకటకృష్ణ, తాతపూడి మారుతీరావు, బ్లడ్ బ్యాంకు అధినేత నాని పాల్గొన్నారు.

బలుసులమ్మకు విశేష పూజలు



బలుసులమ్మ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): బలుసులమ్మకు శుక్రవారం ఆలయంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి రవిశంకర్ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు వెలవలపల్లి ప్రదీప్ శర్మ, వెలవలపల్లి గోపీనాథ్ శర్మ, బాదంపూడి మల్లిఖార్జున శర్మల బ్రహ్మత్వంలో విశేష పూజలు జరిగాయి. దాతలు సహాయ సహకారాలతో అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యంలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



కృష్ణుడు చెరువులో ఆయిల్ బాల్స్ వేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మునిసిపల్ కమిషనర్ డి.మురళీకృష్ణ అన్నారు. పట్టణంలో శుక్రవారం స్థానిక టూ టౌన్‌లోని 23వ వార్డు కృష్ణుడు చెరువులో దోమల నిర్మూలనకు ఆయిల్ బాల్స్ వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్ల వద్ద ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అదే విధంగా ప్రతి రోజు పారిశుద్ధ్య సిబ్బందికి ఇంటిలో తయారైన వ్యర్థాలను అందజేయాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా పారిశుద్ధ్య విభాగం అనేక చర్యలు చేపడుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇనస్పెక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

తణుకులో ప్రపంచ రక్తదాతల దినోత్సవం



తణుకులో రక్తదానం చేస్తున్న దాతలు

తణుకు: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, తాడేపల్లిగూడెం వింగ్స్ ఆఫ్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం శుక్రవారం తణుకులో ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరంలో భాగంగా ముందుగా రక్తదాతలతో ఇండియన్ రెడ్ క్రాస్ ప్రతిజ్ఞ చేయించి అనంతరం రక్తదాన శిబిరం ప్రారంభించారు. సుమారు 15 మంది రక్త దాతలు తమ రక్తాన్ని దానం చేశారు. ఈ విధంగా రక్తదానం చేసిన దాతలను జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ మంతెన శివరామ బద్రిరాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో వలవల బాబ్జీ, బొలిశెట్టి రాజేష్, గొర్రెల శ్రీధర్, తణుకు ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ కారుమంచి యోహాన్, వింగ్స్ ఆఫ్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ సభ్యులు, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

చిటికెలో పేమెంట్

- ఎక్కడ చూసిన డిజిటల్ లావాదేవీలు
- ఆన్‌లైన్ పేమెంట్లకు పెరుగుతున్న ఆదరణ



తణుకులో చిల్లర సామాన్లు అమ్మే దుకాణంపై ఉన్న ఆన్‌లైన్ పేమెంట్ కార్డు

తణుకు అర్బన్: మారుతున్న నేటి కాలాన్ని బట్టి వ్యాపార లావాదేవీలన్నీ నగదు రహితంగానే నిర్వహిస్తున్నారు. పెద్ద మాల్స్ నుంచి రోడ్డు పక్కన పండ్లు, వివిధ సామగ్రి విక్రయాలు జరిపే చిరు దుకాణాలు, తోపుడు బండ్లపై నిర్వహించే వ్యాపారాల్లో సైతం సెకన్లలో ఆన్‌లైన్ పేమెంట్స్ చేసేస్తున్నారు. దీంతో బ్యాంకుల్లో సైతం నగదు మారక శాతం తగ్గినట్లు తెలుస్తోంది. నగదు లావాదేవీలకు సంబంధించి కాగితాల కంటే వివిధ రకాలుగా నిర్వహిస్తున్న నగదు రహిత లావాదేవీలకే జనం మొగ్గుచూపుతున్నారు. ముఖ్యంగా చిరు వ్యాపారాల్లో అధిక శాతం నగదు రహితంగా ఏర్పాటు చేసుకున్న వివిధ కంపెనీలకు చెందిన స్కానర్‌ల ద్వారా డబ్బు మారకం జరుగుతుంది. మార్కెట్‌లో నిత్యం జరిగే లక్షలాది రూపాయిల క్రయ విక్రయాల్లో 70 శాతం ఆన్‌లైన్ పేమెంట్ రూపంలో జరుగుతుందని వ్యాపారులే చెబుతున్నారు.

మొబైల్ యాప్‌ల ద్వారా...

దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన వివిధ కంపెనీలకు చెందిన స్కానర్‌లను వినియోగదారులు తమ మొబైల్‌లో ఉన్న ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, వాట్సాప్ వంటి యాప్‌ల ద్వారా నగదును బ్యాంక్ ఖాతాలకు జమ అయ్యేలా స్కాన్ చేస్తున్నారు. అంతేకాకుండా వ్యాపార రంగంలో కీలకపాత్ర పోషిస్తున్న నగదు రహిత లావాదేవీల కారణంగా బ్యాంకుల్లోను, ఏటీఎం సెంటర్‌ల వద్ద ఖాతాదారుల రద్దీ కూడా తగ్గింది. చిరు వ్యాపారాల్లో స్కానర్‌ల ద్వారా నగదు మారకం ఆన్‌లైన్‌లో జరుగుతుండగా, మాల్స్, సూపర్ బజార్, పెట్రోలు బంకుల్లో మాత్రం వారి వద్ద ఉన్న మిషన్‌లలో వినియోగదారులకు సంబంధించిన వివిధ బ్యాంకుల డెబిట్, క్రెడిట్ కార్డులను ఉపయోగించి నగదు రహిత లావాదేవీలు జరుపుతున్నారు. దీంతో నగదు మారకం చాలా సులువుగా జరుగుతున్న పరిస్థితులు నేడు కనిపిస్తున్నాయి.

చిల్లరకు చెక్...

వ్యాపారస్థుడి నోటి నుంచి ఎక్కువగా వినపడేది చిల్లర కావాలనే పదం కానీ నేడు అధికశాతం జరుగుతున్న నగదు రహిత లావాదేవీలతో ఆ చిల్లర అనే పదం కూడా వినిపించని పరిస్థితి నెలకొంది. గతంలో ఆన్‌లైన్ పేమెంట్స్ సౌకర్యం లేని సమయంలో చిల్లర నాణాలతో కూడా వ్యాపారం చేసేవారు. నూటికి రూ.5 నుంచి రూ. 10లు కమిషన్ తీసుకునే పరిస్థితి ఉండేది. కానీ నేడు జరుగుతున్న నగదు రహిత లావాదీవీలతో పేమెంట్ చేశామనే సాక్ష్యం కూడా చూపించే విధానం వ్యాపారుల్లో సంతృప్తినిస్తుంది.



తణుకులో బొప్పాయి అమ్మే బండిపై ఉన్న ఆన్‌లైన్ పేమెంట్ కార్డు



తణుకులో బట్టల దుకాణంలో ఉన్న ఆన్‌లైన్ పేమెంట్ కార్డు

శంకరమఠంలో పవిత్రోత్సవాలు



శంకరమఠంలో శతరుద్రీయ పారాయణంలో పాల్గొన్న అర్చకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక శంకరమఠంలో శ్రీ ఉమా చంద్రమౌళీశ్వర స్వామివారికి, శ్రీ సర్వమంగళ అమ్మవారికి దేవస్థానం పవిత్రోత్సవాలు సందర్భంగా మహా రుద్రయాగంలో భాగంగా శుక్రవారం ఆదిశంకరాచార్య స్వామికి విశేష అర్చనలు నిర్వహించారు. చంద్రమౌళీశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి విశేష కుంకుమార్చనలు జరిగాయి. 20 మంది పండితులచే శతరుద్రీయం పారాయణం నిర్వహించారు. మచిలీపట్నం కాశీపట్నపు ఉమాదేవిచే సంగీత కచేరి జరిగింది. మృదంగంపై సరస్వతుల హనుమంతరావు, వైలన్‌పై పాలపర్తి ఆంజనేయులు సహకరించారు. ఆలయ కమిటీ ప్రయాగ కిషోర్, జ్యోశ్యుల పాండురంగ శాస్త్రిలు పర్యవేక్షించారు.

యువత చేగువేరా ఆశయ సాధనకు కృషి చేయాలి



తణుకులో చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

తణుకు: ప్రపంచ విప్లవకారుడు చేగువేరా అనీ.. యువత చేగువేరా ఆశయాలు, స్ఫూర్తితో కొనసాగాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. చేగువేరా 97వ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రపంచ మానవాళి విముక్తి కోసం భౌగోళిక సరిహద్దులతో సంబంధం లేకుండా అమెరికన్ సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా ఆఖరి క్షణం వరకు పోరాడిన ధీరుడు కోట్లాది మంది యువత గుండెల్లో నిలిచిన యోధుడు చేగువేరా అని భీమారావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి, ఏరియా కన్వీనర్ టి.అప్పలస్వామి, పట్టణ కోశాధికారి గుబ్బల వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకులు బొద్దాని మురళీకృష్ణ, బండి సత్యనారాయణ, డేగల హనుమంతరావు, బొద్దాని కృష్ణ కిశోర్, నూనె రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ఉపాధి పనులు



వెంకయ్య వయ్యేరు పంట కాలవలో తూడు, గుర్రపు డెక్క తొలగిస్తున్న ఉపాధి కూలీలు

కాళ్ల: మండలంలో ఉపాధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. కాలువలలో నీటిని విడుదల చేయడంతో ఉపాధి హామీ పథకంలో పంట, మురుగు కాలువల్లో తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులు చేస్తున్నారు. మండలంలో ప్రధాన పంట కాలువలు వెంకయ్య వయ్యేరుతోపాటు పంట కాలువలో అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతో త్వరితగతిన మంచినీటి చెరువులను నింపుకోవడానికి, సాగుకు నీటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో సాగు, తాగు నీరు అందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మండలంలో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు 223 పనులకు అంచనాలు వేసినట్లు ఉపాధి హామీ అధికారులు తెలిపారు. దీనిలో భాగంగా నాలుగు కోట్ల నలభై లక్షలతో మండలంలో 21 గ్రామాల్లో ఉన్న పంట మురుగు కాలవల్ల అభివృద్ధి పనులకు ప్రతిపాదనల ద్వారా పనులు చేస్తున్నట్లు టెక్నికల్ అసిస్టెంట్ వీ.మణికంఠ శుక్రవారం తెలిపారు. ఇప్పటి వరకు 60 వేల పని దినాలు కల్పించినట్లు, రూ.1144 కోట్లు వేతనదారులకు అందించినట్లు ఆయన తెలిపారు. వీటితోపాటు కాలువ గట్లపై మొక్కలు నాటే ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు.

విద్యతోనే బంగారు భవిష్యత్



ఉండిలో విద్యా సామాగ్రి పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఉండి: ప్రతి మనిషికి విద్యతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వేగేశ్న అనంతలక్ష్మీ, కన్నెగంటి రూత్‌కళ అన్నారు. శుక్రవారం ఉండి మెయిన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం హన్రీటా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలు ప్రజల జీవితాల్ని ప్రభావితం చేస్తాయన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన దృష్ట్యా మండలంలోని వివిధ ప్రాంతాల్లో విద్యా సామాగ్రి పంపిణీ కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు రుద్రరాజు నరసరాజు,గాదిరాజు రంగరాజు, సత్తి బ్రహ్మారెడ్డి, బీ.హరనాధరాజు, కాగిత మహంకాళి, గొట్టుముక్కల రాము, కలిదిండి సీతారామరాజు, నంబూరి కాశీ విశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

భూ యాజమాన్య హక్కు చట్టం రద్దుపై హర్షం

నరసాపురం: భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకోవడంపై నరసాపురం బార్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. శుక్రవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యనాయుడు అధ్యక్షతన న్యాయవాదులు సమావేశం నిర్వహించి కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. సీనియర్ న్యాయవాదులు కానూరి స్వామినాయుడు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు సంతాపం

భీమవరం: కృత్తివెన్ను మండలం సీతనపల్లిలో రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడం బాధాకరమని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలందించాలని అధికారులను ఆదేశించినట్టు పేర్కొన్నారు.

23న బీవీఆర్‌లో నెలవారీ సంగీత, నృత్య సమాహారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో ఈ నెల 23వ తేదీ ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు కళాకారులు ఆధ్వర్యంలో నెలవారీ సంగీత, నృత్య సాహితీ, సాంస్కృతిక సమాహారం నిర్వహించనున్నట్లు బీవీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు వెల్లడించారు. కళాకారులచే ట్రాక్ సింగింగ్, ధవళేశ్వరం నాట్యాచారిణి ఎ.శ్రీలతచే నృత్య ప్రదర్శన, అనంతరం సభ, సత్కారాలు ఉంటాయని తెలిపారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వంగవండు రామ్మోహన్‌రావుకు గౌరవ సేవా పురస్కారం, నాట్యాచారిణీ శ్రీలతకు నాట్యమయూరి పురస్కారం, ప్రముఖ హాస్య నటులు, దర్శకులు ఎన్.గంగాధరరావుకు ఆర్థిక సత్కారం చేసేందుకు నిర్ణయించినట్లు వివరించారు. కళాకారులు, సాహితీ ప్రముఖులు, పట్టణ ప్రజలు హాజరై నెలవారీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బ్యాంకు వేలంలో భూమి స్వాధీనం

పాలకోడేరు: మండలంలోని గొల్లలకోడేరు గ్రామ పంచాయతీ పరిధిలో ఆర్ఎస్ నెంబర్ 357/2, 365/4, 365/5, 366/1బి, 365/4, 365/5, 366/1బి, 366/2, 357/2, 365/4, 365/5 నెంబర్లో గల భూమిని కెనరా బ్యాంకులో వేలం వేశారు. వేలంలో పాడుకొన్న కేఎస్ఆర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, మనోహర్ ఆక్వా ఫారమ్స్, శ్రీ అంజనా ఆక్వా కంపెనీల ప్రతినిధులు శుక్రవారం బ్యాంకు అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. కాగా ముందుగా ఈ సర్వే నెంబర్ భూములపై రుణాలు తీసుకున్న వారు హైకోర్టుకు, డీఆర్టీ కోర్టుకు వెళ్లినప్పటికీ కోర్టులు వారి కేసులను కొట్టి వేయడంతో బ్యాంకు అధికారులు వేలం దారులకు ఈ భూములను స్వాధీనం చేశారు.

ముమ్మరంగా పంట బోదె తవ్వకం పనులు



కేపీపాలెం సౌత్‌లో పంట బోదె తవ్వుతున్న ఉపాధి కూలీలు

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో పంట బోదె తవ్వకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కాలువలు వదలడంతో ప్రతి శివారు ప్రాంతానికి సాగు నీరందాలనే ఉద్దేశ్యంతో పంట బోదె తవ్వకం పనులు చేపట్టారు. మండలంలోని కేపీపాలెం సౌత్, నార్త్, మొగల్తూరు పంచాయతీలోని పాలకమ్మచెరువు, నక్కావారిపాలెం, పడమటిపాలెం తదతర ప్రాంతాల్లో శుక్రవారం పంట బోదె తవ్వకం పనులు ప్రారంభించారు. దాళ్వా సాగుకు సంబంధించి ప్రతి ఎకరాకు సాగు నీరందించినట్లుగానే సార్వా సాగుకు ప్రతి శివారు భూములకు నీరందించేందుకు పంట బోదెల తవ్వకం చేపట్టామని వెంకటేశ్వరరావు తెలిపారు.

దివ్యాంగుల పిల్లలకు ఉచితంగా ప్రత్యేక విద్య



బాలీశ్వరయ్య

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల పిల్లలకు ఉచితంగా ప్రత్యేక విద్యను అందజేస్తున్నామని భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని భవిత సెంటర్‌లో తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలకు సమగ్ర శిక్ష వారిచే భవిత సెంటర్‌లో వైకల్యాల లోపాన్ని బట్టి సామర్థ్యాలు, అభివృద్ధికి అవసరమైన నైపుణ్యాలను అందజేస్తున్నట్లు తెలిపారు. పిల్లలతో మమేకమై యోగ, కోకర్కులర్ యాక్టీవిటీస్‌తో శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి బుధవారం జరిగే ఫిజియోథెరఫిస్ట్ ద్వారా వైకల్యం ఉన్న పిల్లలకు ఫిజియోథెరపీ చేయిస్తున్నామని, మాటలు రాని వారికి స్పీచ్ థెరపీ, అకాడమిక్ స్కిల్స్‌లో భాగంగా రాయడం, చదవడం, అంకెలు, కూడికలు చేయడం, నాణెములను, నోట్లును గుర్తించడం, రంగులను గుర్తించడం, ప్రవర్తన సమస్యలు ఉన్నవారికి మార్పులు తీసుకురావడం, లైఫ్ స్కిల్స్ నేర్పించడం, శారీరక శ్రమ కోసం ఆటలు ఆడించడం, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు పిల్లలచే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలు తెరిచినందున స్కూల్ యూనిఫాం బోధనా సామగ్రి ఉచితంగా అందజేస్తున్నట్లు చెప్పారు. వివిధ రకాల అలెవెన్సులు ఉన్నందున దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, చదివించాలని, ఇతరుల మీద ఆధారపడకుండా జీవించగల్గుతారన్నారు. ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవగాహన కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



గుమ్ములూరులో సాయిబాబా ఆలయ వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న గ్రామ పెద్దలు



అఖండ అన్నసమారాధనను ప్రారంభిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ వానపల్లి బాబూరావు

ఆకివీడు: సాయిబాబా ఆశీస్సులు తమ గ్రామంపై ఎల్లప్పుడూ ఉంటాయని ఏఎంసీ మాజీ చైర్మన్ వానపల్లి బాబూరావు భక్తి భావం వ్యక్తం చేశారు. మండలంలోని గుమ్ములూరులో వేంచేసియున్న సాయిబాబా ఆలయం 22వ వార్షికోత్సవం శుక్రవారం వైభవోపేతంగా నిర్వహించారు. ప్రతీ ఏటా వార్షికోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ గురువారం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. ఆలయంలో సాయిబాబాకు అఖండ పూజలు, హారతులు అందజేశారు. అనంతరం అఖండ అన్నసమారాధనను బాబూరావు ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు అన్యెం కృష్ణ, మండల యువజన కమిటీ అధ్యక్షుడు చిక్కాల రామాంజనేయులు (చిన్నా), వానపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

గోవధకు పాల్పడితే కఠిన చర్యలు



గోవధ నిషేధంపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ మల్లేశ్వరరావు

పాలకొల్లు సెంట్రల్: గోవధ చట్టరీత్యా నేరమని బక్రీద్ పేరు చెప్పి ఎవరైనా గోవును వధిస్తే కఠిన చర్యలు తప్పవని సహాయ సంచాలకులు, ప్రాంతీయ పశు వైద్యశాల డాక్టర్ జి.మల్లేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక వెటర్నరీ ఆసుపత్రి నుంచి గోవధ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ గో వధకు పాల్పడిన, సహకరించిన వారికి కూడా 1962 చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గోవులను, దూడలను ఆడ, మగ ఏదైనా సరే ఉద్దేశపూర్వకంగా వధించకూడదని అన్నారు. మిగిలిన పశువులు ఎద్దు, దున్న, గేదెలు వంటి వాటిని వధించాలంటే వాటి వయస్సు ఖచ్చితంగా 14 సంవత్సరాలు దాటి ఉండాలన్నారు. పశువులు వ్యవసాయానికి, బ్రీడ్ అభివృద్ధికి పూర్తిగా నిరుపయోగంగా ఉన్నాయని ప్రభుత్వం నియమించిన పశు వైద్యులు ధ్రువీకరణ పత్రం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ అనుమతి ఉన్న కబేళాల్లో మాత్రమే వధించాలన్నారు. రోడ్లపై, ఇళ్లల్లో ఎక్కడ పడితే అక్కడ వధించి మాంసాన్ని విక్రయించడం చట్టరీత్యా నేరమని అన్నారు. సీఆర్‌పీసీ 43 యాక్టు ప్రకారం ఎప్పుడైనా కాగ్నిజబుల్ నేరం జరిగినప్పుడు ఎవ్వరైనా ప్రైవేటు వ్యక్తి కూడా నేరం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసే హక్కు ఉంటుందన్నారు. గోవధను, గోవుల రవాణాను ప్రతీ పౌరుడు అడ్డుకోవచ్చని, అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసి వారికి అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పీసీఏ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోమ కాటు.. ఆరోగ్యానికి చేటు



గ్రామంలో మలేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పెంటపాడు: ప్రపంచ వ్యాప్త ఆరోగ్య సమతుల్యత సాధనకై మలేరియా వ్యతిరేక పోరాటాన్ని వేగవంతం చేద్దామంటూ ఆరోగ్య కార్యకర్తలు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈనెల ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు మేలరియా వ్యతిరేక మాసోత్సవాలను నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. జాతీయ కీటక జనితత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరిస్తున్నారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందకుండా నివారణ మందులను స్ప్రే చేయాలని సూచిస్తున్నారు. గంబూషియా చేపలను వదలడం ద్వారా దోమల లార్వాలను అరికట్టవచ్చని సూచిస్తున్నారు. ఇళ్లలోని గోడలపై సింథటిక్ పైరిత్రాయిడ్(ఎసీఎం) అవసరాన్ని బట్టి దోమల మందులను స్ప్రే చేయాలని అవగాహనకల్పిస్తున్నారు. దోమ తెరలు, దోమ చక్రాల ద్వారా దోమల నుంచి రక్షణ పొందవచ్చని సూచిస్తున్నారు.

మలేరియా లక్షణాలు

చలి, వణుకుతో కూడిన జ్వరం, అనాఫిలిస్ దోమల ద్వారా వ్యాపిస్తుందని చెబుతున్నారు. ప్లాస్మోడియా జాతికి చెందిన రెండు క్రిముల వల్ల మలేరియా వ్యాప్తి చెందుతుందని పేర్కొంటున్నారు. దీనిలో వైవాక్ మలేరియా తక్కువ బాధిస్తే, పాల్సీఫారం మలేరియా ఎక్కువ బాధించడమే కాకుండా కొన్ని పరిస్థితుల్లో ప్రాణాంతక స్థాయికి చేరుతుందని విశ్లేషిస్తున్నారు. దోమ కుట్టిన 8 నుంచి 12 రోజుల్లో వ్యాధి లక్షణాలు బయటపడతాయని, చిన్న పిల్లలకు గర్భిణులకు ఈవ్యాధి ప్రమాదకరమైనదని చెబుతున్నారు. రక్తపరీక్షలు అనగా (బీఎస్), ఆర్డీటెస్ట్) ద్వారా ఈవ్యాధిని నిర్ధారించడవచ్చని పేర్కొంటున్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మలేరియా వ్యాధి అనాఫిలిస్ అనే ఆడ దోమల వల్ల వ్యాప్తి చెందుతుంది. మలేరియా వ్యాధి వ్యాప్తి స్థానిక పరిస్థితులపై, పరిసరాల పరిశుభ్రతపై ఆధారపడి ఉంటుంది. ఈ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. రక్త మార్పిడి సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లక్షణాలు కనిపించిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలి. ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్ల సూచనలు పాటించాలి.

– డాక్టర్ పూజిత, ముదునూరు ప్రాథమిక వైద్యాధికారి

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తాడేపల్లిగూడెం: 90102 23729, 90100 68395
తణుకు: 90108 43311, 90100 51493

Office mail : tpgadvt@gmail.com